ప్రజాశక్తి

ఆదివారం 17 డిసెంబర్ 2023



గ్రూప్ -2 పరీక్షకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

ఎపిపిఎస్‌సి నిర్వహించే గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ కోసం ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అర్హులైన బిసి ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎపి స్టడీసర్కిల్ ఫర్ బ్యాక్‌వర్డు క్లాసెస్ డైరెక్టర్ కె.సందీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని చూచించారు. ఈ నెల 27 వ తేది నుంచి 50 రోజులు పాటు 80 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పది, డిగ్రీ మార్క్ లిస్టులు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్,బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, 2 పాస్ ఫోటో సైజు ఫోటోలు దరఖాస్తుతో జతచేయాలని కోరారు. మిగతా వివరాలకు ఫోన్ నెం.9603557333, 8330967871ను సంప్రదించాలని తెలిపారు.

అంగన్వాడీల సమ్మె ఉధృతం

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

- మూతికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన
- కేంద్రాల తాళాలు పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతులు
- సమ్మెకు సచివాలయ ఉద్యోగులు సహకరించాలని విజ్ఞప్తి
- ఎమ్మెల్సీ సాబ్జీకి నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం ఐదో రోజుకు చేరుకుంది. ప్రభుత్వంతో చర్చలు విఫలమవ్వడంతో సమ్మె మరింత ఉధృతంగా మారుతోంది. మరోవైపు కేంద్రాల తాళాలు పగులగొట్టే వాటిని నడిపేందుకు చేస్తున్న అధికారుల చర్యలను అంగన్‌వాడీలంతా నిరసిస్తున్నారు. తాళాలు బద్దలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి పైడిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జరిపిన చర్చల్లో ఆర్థిక పరమైన డిమాండ్ లు పరిష్కారానికి చొరవ చూపకుండా చర్చలు ముగించడం సరికాదన్నారు. తాము ఏదీ అదనంగా కోరడం లేదని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చెయ్యాలని కోరుతున్నామన్నారు. సమస్యలు పరిష్కారం చేయకుండా కేంద్రాలను బలవంతంగా తాళాలు పగలు కొట్టించడం ప్రభుత్వానికి తగదన్నారు. సచివాలయం ఉద్యోగులు కూడా తోటి ఉద్యోగులేనని, చాలా జిల్లాలో సచివాలయ ఉద్యోగులు కేంద్రాలను తెరిచేందుకు ముందుకు రాలేదని జిల్లాలో ఉన్న సచివాలయం ఉద్యోగులు కూడా తమకు సహకరించాలని కోరారు.

బలవంతంగా కేంద్రాలు తెరిపించడం, అంగన్‌వాడీలను బెదిరించడం వంటి చర్యలు మానుకోవాలని, బెదిరింపులకు భయపడేది లేదని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం మా ఆర్థిక పరమైన డిమాండ్ లు పరిష్కారం చేసే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. సమ్మె శిబిరాన్ని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు బి.సుధారాణి, ఎ.జగన్మోహనరావు సందర్శించి మద్దతు తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ గేటు వద్ద ధర్నా చేపట్టారు. తాళాలు పగలకొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ఎఒకు వినతినిచ్చారు.

గజపతినగరం : అంగన్‌వాడీలంతా సమ్మె కొనసాగించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంగన్వాడీ సమస్యలతో పాటు కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు అన్నింటిపైన అనేక సందర్భాల్లో పోరాటం చేశారని, మా పోరాటానికి మద్దతుగా ఉన్న ఒక గొంతు మూగ పోయిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి అన్నారు. అనంతరం నోటికి నల్ల రెబ్బలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుభాషిని, పి జ్యోతి, నాగమణి, వాణి, నారాయణమ్మ, రవణమ్మ, సుజాత పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టిన వారిపై కేసు నమోదు చేయాలని అంగన్వాడీలు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎంపిడిఒకు వినతి అందించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు రమాదేవి, బంగారు లక్ష్మి, ఆదిలక్ష్మి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

వంగర : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నాచేశారు. తహశీల్దార్ డి ఐజాక్‌కు వినతి అందించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.భారతి, ఎస్. కుమారి, మంగమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

బాడంగి : సమ్మెలో భాగంగా బాడంగి మండల కేంద్రంలో అంగన్వాడీలు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. వీరికి సిఐటియు నాయకులు సురేష్, ఎపి రైతు సంఘం నాయకులు గోపాల్ మద్దతిచ్చారు.

బాడంగిలో భిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు

చీపురుపల్లి : అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దారు ఎం.సురేష్‌కి అంగన్వాడీలు ఫిర్యాదు చేశారు. సమ్మెకు టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు మద్దతు తెలిపారు

బొబ్బిలి, రూరల్ : అంగన్వాడీల పోరాటానికి రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జనసేన నాయకులు బి.దివ్య, లంక రమేష్, బెల్లాన శ్రీను సందర్శించి మద్దతు ప్రకటించారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు అంగన్వాడీలు ర్యాలీ చేపట్టారు. అనంతరం టిడి అప్పయ్యకు వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్‌వాడి యూనియన్ నాయకులు జె.కామేశ్వరి, జి.జ్యోతి లక్ష్మి పాల్గొన్నారు.

గరివిడి : అంగన్వాడీలు సమ్మెలో భాగంగా ఎంపిడిఒ, తహశీల్దార్‌కు వినతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి పిఎస్‌వికె వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు శనివారం నల్ల రిబ్బన్లు కట్టుకొని మోకాళ్లపై నిల్చొని నిరసన తెలియజేశారు. అంగన్వాడీల వద్దకు జనసేన పార్టీ నాయకులు లోకం మాధవి వచ్చి మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, యూనియన్ నాయకులు కృష్ణవేణి, జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఘనంగా ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

- వేలాది మంది విద్యార్థుల ర్యాలీ
- విద్యారంగ సమస్యలపై పోరాటం : ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభ శనివారం ఘనంగా ప్రారంభమైంది. తొలుత ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కార్మిక సంఘాల కార్యాలయం వరకు విద్యార్థులు పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనకు అగ్రభాగాన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అని నినాదాలతో 31 జెండాలతో విద్యార్థులు కవాతు నిర్వహించగా, వేలాది మంది విద్యార్థులు 'విద్యార్థుల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం కార్మిక సంఘాల కార్యాలయ ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె. రవికుమార్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జివిఎఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ అటు దేశంలోను, ఇటు రాష్ట్రంలోను విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాశనం చేస్తున్నాయని అన్నారు. ఒకపక్క నిరంకుశ విద్యా విధానాలతో విద్యార్థులను చదువుకు దూరం చేస్తూనే మరోపక్క ఆ చదువు చెప్పే ఉపాధ్యాయుల పట్ల కూడా ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కర్కశంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు, ప్రజలు ఏకమై ఈ దుర్మార్గాలను తిప్పికొట్టాలని కోరారు. ప్రధానంగా పాఠశాల విలీనానికి కారణమైన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి విద్యారంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ అఖిలభారత కమిటీ సభ్యులు సిహెచ్ పావని మాట్లాడుతూ విద్యార్థులతో వారానికోసారి మన్ కీ బాత్ పెట్టే మన దేశ ప్రధాని కనీసం సంవత్సరానికి ఒకసారి అయినా విద్యార్థుల మనసులో మాట వినాలని అప్పుడే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఈ దేశ ప్రధానికి అర్థమవుతాయని దుయ్యబట్టారు. 2014లో జిల్లాకు హామీ ఇచ్చిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని నేటికీ ఏర్పాటు చేయక పోవడం సిగ్గు చేటన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని, ధరలకు అనుకూలంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లా విద్యారంగ అభివృద్ధికై జరుగుతున్న ఈ మహాసభల్లో రాబోయే కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జూనియర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని , సంక్షేమ హాస్టల్లో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ నాప్కిన్స్ ఇవ్వాలని, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయిం చాలని, నెల్లిమర్ల బొబ్బిలి నియోజకవర్గం కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యాశాఖ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని లేని పక్షంలో విద్యార్థుల తిరుగు బాటుకు ఈ ప్రభుత్వాలు గాలికి కొట్టుకుపోతాయని హెచ్చరించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన ప్రతినిధులతో జిల్లా మహాసభ స్థానిక కొత్తపేటలో ప్రారంభమైంది. ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్ వెంకటేష్ జెండా ఆవిష్కరించారు.

బహిరంగ సభకు హాజరైన విద్యార్థులు

ఇంధన పొదుపు అందరి బాధ్యత

విద్యుత్ శాఖ ఎస్ఇ లక్ష్మణరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ లో శనివారం ఇంధన పొదుపు పై సదస్సు జరిగింది. పలు ఇంజినీరింగ్ కాలేజీల నుండి విద్యార్థులు , విద్యుత్ సంస్థలో పని చేసే ఇంజినీర్లు సదస్సులో పాల్గొని ప్రెజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్ఇ ముచ్చల లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ పొదుపు ఆవశ్యకతను, సంస్థ తీసుకుంటున్న చర్యలను వివరించారు. సదస్సులో కళాశాల ఇఇఇ హెచ్ఒఇ ఆర్. గౌరీశంకర్ నూతన సాంకేతిక విధానాలను అవలంభించి ప్రత్యామ్నాయ ఇంధన వనరులతో విద్యుత్ ఉత్పాదన చేయాలని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇఇ పి.త్రినాధరావు, డిఇ జి. సురేష్ బాబు, డిఇలు పి.హరి, కెయస్‌పి కుమార్, ఎడిఇ,ఎఇలు కె.ప్రసన్నకుమార్, పి.అప్పలస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు చేసి చంద్రబాబులా వదిలేయం

- వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- విమానాశ్రయ నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రులు, ఎమ్మెల్యేల బృందం

ప్రజాశక్తి-భోగాపురం

చంద్రబాబులా శంకుస్థాపనలు చేసి వదిలేయడం తమకు తెలీదని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో శనివారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. అనంతరం విమానాశ్రయ ప్రాంతంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు వలె ఎన్నికల ముందు శంకుస్థాపనలు చేసి ఓట్లు దండుకోవడం తమకు తెలియదన్నారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన ప్రతి ప్రాజెక్టు నిర్మాణ దశలో ఉందని చెప్పారు. ఉత్తరాంధ్రంలో అనేక ప్రాజెక్టులకు జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. 25 నుంచి 30 నెలల్లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి.. జిఎంఆర్ సంస్థకు సూచించారని వెల్లడించారు. అందుకు అనుగుణంగా వేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవినీతికి చోటు లేకుండా విమానాశ్రయ భూసేకరణ చేపట్టినట్లు తెలిపారు.



విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేల బృందం

కేవలం కావాలనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని కొట్టిపారేశారు. ముందుగా విమానాశ్రయ పనులను ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. రన్‌వే, టెర్మినల్, పరిపాలన విభాగం భవనాల నిర్మాణాలకు సంబంధించిన వివరాలను జిఎంఆర్ సంస్థ ప్రతినిధి రామరాజు మ్యాప్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్‌పిలు బెల్లాన చంద్రశేఖర్, ఎం.వి.వి సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ధర్మాన క్రిష్ణదాస్, బొత్స అప్పలనర్సయ్య, కళావతి, ఆదీప్‌రాజ్, కంబాల జోగులు, అలజంగి జోగారావు, ఆర్‌డిఒ సూర్యకళ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

జనవరి 23న శంబర సిరిమానోత్సవం

పార్వతీపురంరూరల్ : శంబర పోలమాంబ జాతరను రాష్ట్ర ఉత్సవంగా వచ్చే జనవరి 22,23,24 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. 23న జాతర ప్రధాన ఘట్టం సిరిమానోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శంబర జాతరపై శనివారం ఆర్‌డిఒ తన కార్యాలయంలో సమావేశం జరిగింది. జిల్లా దేవాదాయశాఖ అధికారి డివివి ప్రసాదరావు జాతర తేదీలను వివరించారు. ఈనెల 18న పెద్దమ్మ వారి చాటింపుతో ప్రారంభమై 2024 మార్చి 26 జరిగే చండి హెూమం, మహాన్నదానంతో ఉత్సవాలు ముగుస్తా యన్నారు. జనవరి 22న తొలేళ్లు, 23న సిరిమానోత్సవం, 24న అనుపోత్సవం జరుగుతాయని చెప్పారు. జనవరి 30 నుండి మార్చి 26వరకు మారు జాతర పది వారాలు జరుగు తాయని వివరించారు. డీఎస్పీ జి.మురళీధర్ మాట్లాడుతూ 4గురు డీఎస్పీలు, 12 మంది సిఐలు, 38 మంది ఎస్ఐలతో సహా మందిని గత ఏడాది బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా విపత్తు స్పందన అధికారి కె శ్రీనివాస బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఓ ప్రభాకరరావు, ప్రజా రవాణా డిపో మేనేజర్ ఇకెకె దుర్గ, వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి వినోద్, సాలూరు తహశీల్దార్ ఆర్.బాలమురళి, మక్కువ ఎంపిడిఒ పి.దేవ కుమార్, ఇఒ వివి నారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేమలత



కబడ్డీ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుబ్బారెడ్డి, కోలగట్ల

19 నుంచి మహిళా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 19,20,21 తేదీలలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో, ఇందుకు సంబంధించిన పోస్టర్లను వైసిపి ప్రాంతీయ వ్యవహారాల ఇన్చార్జి వైవి సుబ్బారెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు జరుగనున్నాయి. స్థానిక మహిళా పార్కులో ఈ మేరకు పోటీల సన్నాహాలను చేపడుతున్నారు. మొదటి బహుమతిగా 50వేల, రెండవ బహుమతిగా 40 వేలు, మూడో బహుమతిగా 30 వేలు, నాలుగో బహుమతిగా 20 వేల రూపాయలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేల విడిచి సాము

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బలవంతుని నాకేమని నిగ్రహించి పలుకుటమేల... బలవంతమైన సర్పం చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ... అన్నాడు ఓ పద్యకవి. అచ్చంగా ఆ తీరును సిఎం జగన్మోహన్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వం వంట బట్టించుకోవాల్సిన అవసరం ఉందని చాలా మంది జనం అభిప్రాయపడుతున్నారు. రెప్పపాటులో ఒక్క కాటుతో సమస్త జీవరాసుల ప్రాణాలను తీయగల శక్తి సామర్థ్యాలు విషసర్పానికి ఉంటాయి. అంతమాత్రాన తనను మించిన జీవరాశి లేదనుకుంటే పొరపాటే. విష సర్పమైనా చలి చీమలు కూడా చుట్టుముడితే చావాల్సిందే. ఇక్కడ చావు, బతుకుల సమస్య కాకపోయినప్పటికీ ఓవైపు అంగన్‌వాడీల ఆకలి కేకలు, అభద్రతా భావాలు, హక్కులు, ఆక్రోశాలు... మరోవైపు ప్రభుత్వ అధికార దర్పం. అధికార దుర్వినియోగం. పదవీగర్వం మధ్య పెనుగులాట జరుగుతోంది. పదవులు, అవి ఇచ్చిన అధికారం గొప్పవే. కానీ, గొప్ప తనం కల్పించింది మాత్రం ప్రజలు, వారికి సేవచేస్తున్న ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు. ఈ విషయం మరిచిపోతే నేల విడిచి సాముచేసినట్టే లెక్క. ప్రభుత్వం ఇటువంటి లెక్కలనే మర్చిపోతున్నట్టుగా కనిపిస్తుందని జనం చర్చించు కుంటున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గత ఐదురోజులుగా రాష్ట్ర వ్యాప్తంగాను, జిల్లాలోను సమ్మె చేస్తూ శాంతియుతంగా నిరసన దీక్షలు చేపడుతున్న సంగతి తెలిసిందే. వారేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. ఎన్నికలకు ముందుకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను మాత్రమే నెరవేర్చాలని కోరుతున్నారు. గౌరవ ప్రదంగా బతుకీడ్చేందుకు తెలంగాణాలోని అంగన్‌వాడీల కన్నా ఎక్కువ వేతనాలు ఇస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని మాత్రమే కోరుతున్నారు.



బిల్లుల బాకాయి చెల్లించి అప్పుల ఊబినుంచి గట్టెక్కించమంటున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం బతుకుకీడ్చుకునేందుకు పింఛను రూపంలో భోరోసా కల్పించమని కోరుతున్నారు. ఊచ్ అంటే ఊడిపోయే విధంగా కాకుండా ఉద్యోగ భద్రత కల్పించమని వేడుకుంటున్నారు. అక్షరాల అంగన్‌వాడీ కోరికలు ఇవే. వీటన్నింటినీ నెరవేరుస్తామనిఅధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదు సరికదా అంగన్‌వాడీలపై ఉక్కుపాదం మోపేందుకు బరితెగించింది. అధికారంలోకి వచ్చాక అనేక సార్లు అంగన్‌వాడీలను అరెస్టులు చేయడం, నిర్బంధాలకు పాల్పడడం, బెదరింపులకు దిగడం తెలిసిందే. ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఇటీవల సమ్మె నోటీసు ప్రభుత్వానికి ఇచ్చారు. అయినా ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఈనెల 12 నుంచి సమ్మెసైరన్ మోగించారు. విజయనగరం, పార్వతీపురం జిల్లాల కలెక్టరేట్ల వద్ద, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద రోజూ నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ధర్నా, దీక్షలు, రాస్తారోకో, నల్లబ్యాడ్జీలు, కళ్లకి గంతలు కట్టుకోవడం వంటి రూపాల్లో నిరసన జ్వాల కొనసాగుతోంది. వీరికి రోజు రోజుకూ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు,ఉద్యోగ సంఘాల నుంచి మద్దతు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో చర్చలకు ఆహ్వానించి, సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయం, ఐకెపి ఉద్యోగులతో తెరిపించేందుకు ఆదేశాలిచ్చింది. అధికారుల ఒత్తిడితో అక్కడక్కడ ఈ వ్యూహం నెరవేరినప్పటికీ మెజార్టీ కేంద్రాలు తెరుచుకోలేదు. పైగా ఈ పనులు తాము చేయలేమంటూ సచివాలయం, ఐకెపి ఉద్యోగులు చేతులెత్తేస్తున్నారు. మరోవైపు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు అంగన్‌వాడీలపట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడంపై అంగన్‌వాడీలంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం రేపు తమపై కనికరం చూపుతుందా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇంకాస్త లోతుగా ఆలోచించినవారు సమ్మెను విచ్ఛినం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఈ సమస్యలు ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. చాలా మంది ప్రభుత్వ చర్యలను దుయ్య బడుతున్నారు. సమస్యలు పరిష్కరించకుండా ఒకిరిపనులు ఒకరికి అప్పగిస్తే ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందని, తద్వారా రాజకీయంగా నష్టం జరుగుతుందని చెప్పు కుంటున్నారు. ఆ మాట కొస్తే చరిత్ర కూడా ఇదే. ప్రభుత్వ వ్యవస్థలో అంగన్‌వాడీల పాత్ర అత్యంత కీలకమైనది. క్షేత్ర స్థాయిలో జనాలను ప్రభావితం చేయగల సత్తా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉంది. ఈ విషయం గతంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖరెడ్డి ప్రభుత్వాల్లోనూ రుజువైంది. చంద్రబాబు గుర్రాలతో తొక్కించడం, వైఎస్ఆర్ అరెస్టులతో ఇబ్బందులకు గురిచేయడం వంటి సందర్భాల్లో ఆయా ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. తాజాగా అవే విషయాలను అంగన్‌వాడీలు, స్కీమ్ వర్కర్లు, ఇతర ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు.

ఎస్‌పి దీపిక పాటిల్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

ఎస్‌పి దీపికకు అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ నుండి అడిషనల్ డిజి స్థాయి అధికారులకు డిజిపి కె.రాజేంద్రనాథ్‌రెడ్డి శనివారం అవార్డులను ప్రదానం చేశారు. మంగళగిరిలో డిజిపి ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఆయన అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగా విజయనగరం జిల్లా ఎస్‌పి ఎం.దీపిక పాటిల్‌కు క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల విభాగంతో పాటు దిశ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అందించిన సేవలను గుర్తించిన డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి డిజిపి డిస్క్ అవార్డును ప్రదానం చేసి ప్రత్యేకంగా అభినందించారు. చీపురుపల్లి పోలీసు స్టేషనులో కానిస్టేబులుగా పని చేస్తున్న భానోజీరావు కూడా డిజిపి డిస్క్ అవార్డు అందుకున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పెన్‌డౌన్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు శనివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో సమగ్ర శిక్ష సిబ్బంది పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 19 వరకు పెన్‌డౌన్ కొనసాగుతుందని ఉద్యోగులు తెలిపారు. 20 నుంచి సమ్మె చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా సమ్మెకు వెళ్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

కూనాయవలసలో గడపగడపకు..

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని కూనాయవలసలో శనివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు ఎలా అమలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. జనవరి నెల నుంచి రూ.3 వేలు పింఛను ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చామని చెప్పారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం వెల్నెస్ సెంటర్ భవనాలను నిర్మించి ప్రజల వద్దకే పాలన అందించామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సత్యంనాయుడు, బాబ్జీరావు, సర్పంచ్ విజయబాబు, ఎఎంసి ఛైర్మన్ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్‌కు పవన్‌కుమార్ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 15న రాజాం జిఎంఆర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ సెలెక్షన్‌లో ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండో ఏడాది ఇంజినీరింగ్ చదువుతున్న వజ్రపు పవన్ కుమార్ ప్రతిభచూపి సౌత్ జోన్‌కు అర్హత సాధించాడు. ఈనెల 19న చెన్నైలో ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ నిర్వహించే టోర్నమెంట్లో పాల్గొంటాడు. ఈ సందర్భంగా పన్‌కుమార్‌ను విసిబిఎ ప్రెసిడెంట్ డాక్టర్ విఎస్ ప్రసాద్, సెక్రెటరీ ఎన్.సురేష్, వై.కుమార్ అభినందించారు.

అవార్డు అందుకుంటున్న సూరిబాబు

'ఆదిత్య'కు నేషనల్ ఎక్స్‌లెంట్ అవార్డు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ఆదిత్యా విద్యాలయానికి జాతీయ స్థాయి ఎక్స్‌లెంట్ అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్ హైటెక్ ఎగ్జిబిషన్ హాల్లో జాతీయ స్థాయిలో బ్రెయిన్ ఫీడ్ సంస్థ ఎక్స్‌లెంట్ నేషనల్ ఎడ్యుకేషన్ అవార్డులను ప్రదానం చేసింది. ఆదిత్య విద్యాలయం ఫౌండర్ డాక్టర్ వి.సూరిబాబు అవార్డును అందుకున్నారు. ఈ రాష్ట్ర, జిల్లా పాఠశాల యూనియన్ సభ్యులు నాయకులు, అధికారులు, అభినందనలు తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జగనన్నకు చెబుదాం వినతులపై వెంటవెంటనే స్పందించి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించి చేపట్టిన పనులపై ఆరాతీసి, తదుపరి చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, విద్యుత్తు శాఖ ఎఇ, తదితరులు పాల్గొన్నారు.

17న జాతీయ పెన్షనర్స్ దినోత్సవం

విజయనగరం టౌన్ : ఈనెల 17న జరిగే జాతీయ పెన్సనర్స్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పెన్సనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దింటి అప్పారావు పిలుపునిచ్చారు.స్థానిక పెన్సనర్సు అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న దినంగా ఆరోజు ను జరుపుకుంటున్నామని తెలిపారు.

బొబ్బిలిలో ర్యాలీ చేపడుతున్న అంగన్వాడీలు

భోగాపురంలో సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు మాధవి

గజపతినగరంలో శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు లక్ష్మి

అంగన్వాడీల సమ్మె ఉధృతం

నెల్లిమర్ల.. నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

వంగర.. నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

చీపురుపల్లి.. వినతి అందిస్తున్న అంగన్వాడీలు

రేపటి నుంచి అంగన్వాడీ కేంద్రాలను నడపాలి

ప్రత్యేక స్టాక్ రిజిస్టర్లను నిర్వహించాలి ● అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

అంగన్వాడీ కార్యకర్తల సమ్మె కారణంగా బాలింతలకు, గర్భిణీలకు, పిల్లలకు అందాల్సిన ఆహారం ఎటువంటి ఆటంకం కలగకుండా అందేలా చూడాలని అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఇప్పటికే 80 శాతం వరకు అంగన్వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని, మిగిలినవి కూడా స్వాధీనం చేసుకొని సోమవారం నుండి పూర్తి స్థాయి లో నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అంగన్వాడీ సమ్మె పై మంత్రుల బృందంతో జరిపిన చర్చలు విఫలం అయ్యాయని, ప్రభుత్వం మరి కొంత సమయం కోరిన నేపథ్యం లో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా అంగన్వాడీ కేంద్రాలను నడపాలని సూచించినట్లు తెలిపారు. సిడిపిఒలు, ఎంపిడిఒలు, పంచాయతీరాజ్ అధికారులతో శనివారం కలెక్టర్ వెబ్ కాన్ఫెరెన్సు నిర్వహించారు. కేంద్రాల కార్యకర్తలతో సున్నితంగా మాట్లాడి, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు సచివాలయ సిబ్బంది సహకారం తో డ్వాక్రా మహిళలు, తల్లుల సహకారాన్ని తీసుకొని సమీప పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని వండి అంగన్వాడీ కేంద్రాల్లో వడ్డించాలని తెలిపారు. కొన్ని చోట్ల అంగన్వాడీ కేంద్రం కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేసారని తెలుస్తోందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వ కార్యాలయాలని, అక్కడి సొత్తు ప్రభుత్వానికి చెందినదని, స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ తో మాట్లాడి విషయాన్నీ సున్నితంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ సిబ్బంది తోనే అంగన్వాడీ కేంద్రాలను నిర్వహించాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను వేరే గా నిర్వహించాలని, తిరిగి అప్పజేప్పేటప్పుడు స్టాక్ ను సక్రమంగా అప్పగించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న స్టాక్స్ ను వీడియో చేసి ఉంచాలని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుండి 12 వరకు కేంద్రాలను తెరిచి ఉంచాలని అన్నారు. వెంటనే ఎంపిడిఒలు , సిడిపిఒలు సమావేశాలు ఏర్పాటు చేసుకొని సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ రాజ్ కుమార్, జిల్లా కో ఆర్డినేటర్ నిర్మల దేవి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, డిఇఒ లింగేశ్వర రెడ్డి, మెప్మా పీడీ సుధాకర్ పాల్గొన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చేయాలని

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఒకటవ డివిజన్ పరిధి అయ్యప్పనగర్‌లో పూసర్ల మధు సూధనరావు అక్రమంగా నడుపుతున్న స్వాతీ ప్యూరి ఫైడ్ కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్‌చేస్తూ పట్టణపౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శనివారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు, అయ్యప్ప నగర్ పోరాట కన్వీనర్ యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ ఈ వాటర్‌ప్లాంట్‌కు భూగర్భ జల శాఖ అధికారులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఎవరూ అనుమతులు ఇవ్వలేదని, అయినా అక్రమంగా నీటి వ్యాపారం చేస్తూ ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారని తెలిపారు.

మరో వైపు అయ్యప్పనగర్ లో ప్రజలు, సొంత ఇంటిదార్లు తమ ఇళ్లల్లో బోర్లు ఇంకిపోయి నీరు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కావున తక్షణమే అక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చేసి, ప్రభుత్వాన్ని మోసం చేసి అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న యజమాని పూసర్ల మధుసూదన రావును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఎల్‌బిజి నగర్ కార్యదర్శి బి.రమణ, గురజాడ నగర్ కార్యదర్శి రంబ శ్రీను, అయ్యప్పనగర్ కాలనీ అసోసియేషన్ కార్యదర్శి సుదీర్, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంది త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎస్ఎస్ నాయకులు, కాలనీ వాసులు

వృద్ధురాలి హత్య స్థానికుల పనే ?

పోలీసుల దర్యాప్తు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండల కేంద్రంలోని కొండ గుడ్డికి చెందిన మహంతి రాజమ్మ (65) హత్య కేసుపై దర్యాప్తు వేగవంతంగా జరుగుతుందని స్థానిక ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని, సంఘటనా స్థలాన్ని శనివారం ఉదయం విజయనగరం డిఎస్‌పి గోవిందరావు, భోగాపురం సిఐ వెంకటేశ్వరరావు పరిశీలించారు. మృతదేహం పై ఉన్న గాయాలను ఏ ఆయుధంతో చేశారన్న దానిపై పరిశీలన చేశారు. కుటుంబీకులతో మాట్లాడి గ్రామంలో విచారణ చేపట్టారు. హత్య స్థానికుల పనేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను పట్టుకోవడానికి పోలీస్ జాగిలాలను రంగంలోకి దించారు. దర్యాప్తు వేగవంతంగా జరుగుతోందని తెలిపారు.

థర్డ్ పార్టీ విధానం రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలని ఎపి జెఎసి ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మహేంద్ర బాబు, ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఓ హోటల్‌లో జరిగిన ఆర్‌టిసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్‌టిసిలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి థర్డ్ పార్టీ విధానం రద్దు చేసి ఆర్టీసీ సంస్థ ద్వారా జీతాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎంపికైంది. సమావేశంలో తిరుపతిరావు, శివ, జగదీష్, రామకృష్ణ, వెంకట్రావు, నరసయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

21 తరువాత మున్సిపల్ కార్మికుల సమ్మె

నగరపాలక సంస్థ కమిషనర్‌కు సమ్మె నోటీసు

నగరపాలక సంస్థ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21 తరువాత ఏ రోజు నుంచైనా సమ్మెలోకి వెళ్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) విజయనగరం కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడుకు శనివారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ జగన్మోహన్‌రావు, కార్యదర్శి బి.భాస్కరరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి నేడు ఔట్ సోర్సింగ్ కార్మికులని మాట మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చి తీవ్ర ద్రోహం చేశారని మండిపడ్డారు. ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ అమలు చేస్తామని మాట తప్పారని, ముషిడిపల్లి, రామ తీర్థాలు, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికులకు టర్నీకి సిస్టం రద్దు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. నేటికీ మూడు నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని, పారిశుధ్య కార్మికులకు రెండు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు ఉన్నాయని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. మాస్కు, బ్లౌజులు, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సమ్మెలోకి వెళ్తామని తెలియజేశారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో పైడిరాజు, రజిని, రాఘవ, రామచంద్రరావు, రాజు, పైడిరాజు, భాను పాల్గొన్నారు.

జగన్.. ఇదేనా మీ సంస్కారం

జనసేన నాయకులు గురాన అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగతంగా అత్యంత నీచమైన స్థాయికి దిగజారి మాట్లాడటం సరికాదని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌పై జగన్ వ్యాఖ్యలు ఆయన అసహనానికి నిదర్శనమన్నారు. తెలంగాణ ఎన్నికల్లో జనసేన పార్టీకి బర్రెలక్క కంటే తక్కువ ఓట్లు వచ్చాయంటూ సిఎం జగన్ వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటు అన్నారు. 2014లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపికి నోటా కంటే 56 స్థానాల్లో తక్కువ ఓట్లు వచ్చాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు రాళ్లతో కొట్టిన తీరు మర్చిపోయావా అంటూ జగన్‌ను ప్రశ్నించారు. ఇండిపెండెంట్‌గా నిలబడి పోటీ చేసే దమ్ము బర్రెలక్కకైనా ఉంది కానీ.. తెలంగాణలో పోటీ చేసే దమ్ము జగన్‌కు, వైసిపికి లేదన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం పరిసర ప్రాంతాల్లో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారి కోసం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యమిస్తున్నారన్నారు. పవన్ కళ్యాణ్ వల్లనే ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారానికి కదలిక వచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల్లోప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

పథకాల అమల్లో జాప్యంచేస్తే చర్యలు

ఎమ్‌పి నరసింహారావు


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్‌పి నరసింహారావు

ప్రజాశక్తి-వేపాడ

కేంద్ర ప్రభుత్వ పథకాల అమల్లో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్‌పి జివిఎల్ నరసింహారావు తెలిపారు. మండలంలోని సోంపురం గ్రామంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందుతున్నాయా? అని అధికారులను అడిగారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించాలని సూచించారు. పథకాలను సక్రమంగా వినియోగించుకోవడం వల్లే జిల్లాలోని గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. మండలంలో పలు సమస్యలపై డిసిసిబి ఛైర్మన్ వివి చినరామునాయుడు, సర్పంచ్ కలిసి ఎమ్‌పికి వినతి అందజేశారు. గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ కార్డులను ఎమ్‌పి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పట్నాయక్, బిజెపి నాయకులు గోకాడ మహేష్, రూపేష్, చుక్కల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం

రక్తదానం చేస్తున్న యువకులు

విజయదుర్గ యూత్ సొసైటీ, విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక తోటపాలెం సత్య డిగ్రీ కళాశాలలో డాక్టర్ బొత్స సందీప్ జన్మదినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో సుమారు 35 మంది యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చునని అన్నారు. రక్తదానం ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు, సేకరించిన రక్త నిలవలను విజయ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు కార్యక్రమంలో సత్య డిగ్రీ కళాశాల ఎన్‌సిసి అధ్యాపకులు మీసాల సత్యవేణి, సూరప్ప నాయుడు, విజయ దుర్గ యూత్ సొసైటీ అధ్యక్షులు కేశపట్నం చంద్రిక, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్.ఇల్తామష్, సభ్యులు అశోక్,సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రఘు,పూర్ణ, సాయి షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

నగరంలోని వివిధ ప్రాంతాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. 14వ డివిజన్లో 5 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న పశువుల కొట్టాంకు, కొత్త అగ్రహారంలో 8 లక్షలతోనూ రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర అభివృద్దే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సలహాలు, సూచనలతో కృషి చేస్తున్నామన్నారు. నగరంలో విచ్చలవిడిగా పశువుల సంచారాన్ని అరికట్టేందుకు పశువుల కొట్టాంను కొత్తపేటలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, విద్యుత్తు దీపాలు వంటి అవసరాలను తీరుస్తూ నగరానికి అందాలను తెచ్చే ప్రధాన జంక్షన్ల అభివృద్ధి చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ విద్యా బోధన ప్రారంభం

ప్రజాశక్తి-డెంకాడ

డిజిటల్ విద్యాబోధనను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ ఆదినారాయణ

నాడు-నేడులో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ విద్యా బోధనను శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎం.ఆది నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ బోర్డు ద్వారా పాఠ్యాంశాలను బోధించారు. దీన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.